
# మనవడా... దారెటు?

●○

కళ్లు కనిపించని తాతను నడిపించా లనుకున్నాడు ఆ మనవడు. స్వార్థంతో, ద్వేషంతో కళ్లు మూసుకుపోయిన మనుషులు ఆ ఊత కర్ర'ను విరిచేస్తే ఆక్రోశిస్తున్నాడు ఆ తాత "మనవడా ... దా రెటు?" అని! నిజానికి మనమూ ఆ దారి వెతుక్కుంటూనే ఉన్నాం కదూ?

○●



"తాతయ్యా! నిన్ను పట్నం తీసుకెళ్తాను. అక్కడ రైళ్లు, బస్సులు, కార్లు, పెద్ద పెద్ద ఇళ్లు ఉంటాయి. మంచి తిండి కూడా దొరుకుతుంది. ఇలా ఇంటింటికీ వెళ్లి అడుక్కోవటం కన్నా నేను ఏదైనా పని చేసి డబ్బులు సంపాదిస్తాను. నిన్ను కూర్చోబెట్టి రెండు పూటలా అన్నం పెడతాను."

గోపయ్య మనవడి మాటలకు నవ్వి, దగ్గరకు తీసుకుని తల నిమిరి చాలా సేపటి వరకు మాట్లాడలేదు. చూపు లేని కళ్లు త డయ్యాయి. రెండు సంవత్సరాల నుంచి తన చేతి కర్ర పట్టుకుని తనకు దారి చూపిస్తున్న మనవడిని పట్టుకుని వదలలేదు. ఒళ్లంతా తడిమాడు. ఆ స్పర్శ అనుభవంతో గోపయ్య హృదయ నేత్రానికి ఆ కుర్రాడి రూపు కనిపిస్తుంది.

పుట్టుకతోనే గుడ్డివాడు. అమ్మా నాన్నా అనే పదాలు అతని నోటి నుంచి వచ్చిన సంవత్సరానికి తనను నడిపించి, అన్నం పెట్టిన అమ్మ చనిపోయిం దని నాన్న చెబితే తెలిసింది - పూర్తిగా మాట్లాడటం వచ్చాక నాన్నను అడిగితే.

"ఒరేయ్, గోపయ్యా! చిన్నప్పటి నుంచి కష్టపడటంతోనే సరిపోతోంది నా బ్రతుక్కి. మీ అమ్మ నాకు తోడుగా ఉండేదిరా. పిల్లలు పుడితే మన కష్టాలు తీరిపోతా యని వాళ్లని చదివిద్దాం - పెద్ద పెద్ద ఉద్యోగాలు చేస్తే మనం పల్లకీలో ఊరేగవచ్చని నా పాలేరు బ్రతుక్కి ఆశలు చూపించిందిరా! కాని, కళ్లు లేని నిన్ను మా కిచ్చి

**కంచుమర్తి వెంకటేశ్వర రావు**

ఆ దేముడు మా ఆశల కళ్లను పొడిచేశాడు. నిన్ను చూస్తూ ఏడుస్తూ చనిపోయిందిరా. ఇక నేను మిగిలిపోయాను. నా కేదైనా అయితే ను వ్వేమైపోతా వు రా!''

ఆ చిన్న గోపయ్యకు నాన్న మాటలు పూర్తిగా అర్థం కాలేదు.

''ఒరేయ్! ఇది మా కరణం అయ్యగా రిల్లు. ను వ్వీ వరండాలో కూర్చో. ఎవరైనా, ఏదైనా ఇస్తే తిను. కదలవద్దు.''

అడుగులు దూర మయ్యాయి. నాన్న పనికి వెళ్లిపోయా డేమో.

వేళకు ఎవరో ఒకరు అన్నం పెట్టేవారు.

''గుడ్డోడా! ఇదిగో, తిను.''

''గుడ్డీ! ఈ లాగు, చొక్కా వేసుకో.''

''అటు, ఇటూ కదలక అలాగే కూర్చో.''

బొమ్మలా ఎక్కడ కూర్చో మంటే అక్కడ కూర్చుని, ఏం తిన మంటే అది తిని అలాగే పడుండే గోపయ్యకు అప్పు డప్పుడూ బా ధనిపించేది - తనకు ఏదీ చూసి మురిసిపోయే అదృష్టం లేదని. 'అసలు నే నెందుకు పుట్టాను?' అనుకునేవాడు.

ప దేళ్లు వచ్చాయి.

ఒకరోజు కరణం అయ్యగారు కాబోలు తనను దగ్గరకు తీసుకున్నారు. ''ఒరేయ్, గుడ్డీ! ను వ్వెలా బతుకుతా వురా!''

గోపయ్యకు అయ్య గా రెందు కలా మాట్లాడుతున్నారో అర్థం కాలేదు. చేత్తో నేలను తడిమాడు నాన్న కనిపిస్తా డని.

''ఏంట్రా, వెతుకుతున్నావు?'' అయ్యగారే అడిగారు.

''నాన్న ఇక్కడే ఉన్నాడా?'' అని అడిగాడు.

ఇంకా చాలామంది వచ్చినట్లు అడుగులు. అవి తనకు మరీ దగ్గరగా వచ్చి నట్లనిపించింది.

''ఈడు ఎలా బ్రతుకుతా డు?''

''అసలే గుడ్డోడు. మనమే రోజు కొకరం ఇంత పడెయ్యాలి.''

ఎందు కిలా అంటున్నారు వీళ్లు? ''ఏమైం దిప్పుడు?'' అడిగాడు.

''అంతా అయిపోయిందిరా! నీ నాన్న చనిపోయాడురా.''

ఎవరో చెప్పారు. గోపయ్య గుండెలు పగిలేలా ఏడ్చాడు. ఒకరు వచ్చి తన చేయి పట్టుకుని తీసుకెళ్లడమే తెలుసు గోపయ్యకు. నాన్న చనిపోయాడు. మంటల్లో కాలి మట్టిలో కలిసిపోయా డని చెప్పారు. ఆ రోజు నుంచి చిన్న కర్ర పట్టుకుని నేల మీద కొడుతూ వీథి వీథీ తిరగడం, ఎవ రేది పెడితే అది తిని, ఎవ రెక్కడ పడుకోమంటే అక్కడ పడుకుని రోజులు ... నెలలు ... సంవత్సరాలు గడిపేయటం అలవా టయింది గోపయ్యకు.

ఇంటి గుమ్మం తా కి ఇది కరణం గా రిల్లు, మాస్టారి గా రిల్లు, బడి, గుడి అనుకుని తిరగటం అలవాటు చేసుకున్నాడు.

అమ్మా నాన్నా చనిపోయారు.

ఏదీ చూడలేని తను ఇంకా ఎందుకు బతికుండాలి అనుకునేవాడు చాలాసార్లు.

''ఒరేయ్, గోపయ్యా! నేను పంతులు గా రబ్బాయిని. కథలు, కవితలు రాస్తూంటాను. నీపై మంచి కవిత రాస్తాను.''


గోపయ్య ఆ మాటలు వచ్చిన వైపుకు తిరిగాడు.

''బాబూ! మీ రెలా ఉంటారు?''

''నేనా - తెల్లగా, పొడవుగా ఉంటాను, గోపయ్యా! నువ్వు ఏదీ చూడలేవు. నువ్వు ఎలా ఉంటావో తెలుసుకోవా లని నీ కెప్పుడూ అనిపించలేదా?'' అ నడిగాడు పంతులు గా రబ్బాయి.

గోపయ్య నవ్వి, ''నే నెలా ఉంటే ఎందుకు, బాబు గారూ! నా చేతులు నోటిని చూపిస్తున్నాయి ఆకలి తీర్చడానికి. కాళ్లు అరుగు అరుగుకు నడిపిస్తున్నాయి , బ్రతుకు వెళ్లబుచ్చుతున్నాయి'' అన్నాడు.

తర్వాత అనిపించింది ఒక సారి గోపయ్యకు - 'త నెలా ఉంటాను? తన చుట్టూ ఉన్న వా ళ్లెలా ఉంటారు? ఇళ్లెలా ఉంటాయి? చుట్టూ ప్రపంచం




ఎలా ఉంటుంది?' - తెలుసుకోవాలి. కరణం గా రింట్లో అన్నం తిని కర్రతో అడుగులు లెక్క పెట్టుకుంటూ పంతులు గా రింటికి వెళ్లాడు.

''ఏరా, గుడ్డోడా! ఏమి టిలా వచ్చావు?''

ఆ మాట పంతులు గా రమ్మాయిది.

''చిన్నమ్మ గారూ! చిన్నబ్బాయి గా రున్నారా?'' అని అడిగాడు.

ఇంతలో అడుగుల శబ్దం. ఆ అడుగులు అబ్బాయి గారివే.

''ఏం, గోపయ్యా! నన్ను వెతుక్కుంటూ వచ్చావు? అలా వరండాలో కూర్చో'' అన్నారు.

గోపయ్య అక్కడ కూర్చున్నాడు.

''బాబు గారూ! నాకు అన్నీ చూడా లని ఉంది. ఆ అదృష్టం నాకు లేదు. మీ రడిగే వరకూ నాకు నా గురించి, నా చుట్టూ ఉన్న ఈ లోకం గురించీ తెలుసుకోవా లనిపించలేదు. కొంచెం చెప్పండి, బాబుగారూ!

పంతులుగా రబ్బాయి గారు నవ్విన శబ్దం.

''ఒరేయ్! పల్లెలు ఎంతో అందంగా ఉంటాయి. పచ్చని పొలాలు, పిల్ల కాలువలు, రకరకాల రంగు రంగుల పువ్వులూ - ఇవి అందంగా ఉంటాయి. అంద మంటే కంటికి బాగా కనిపించి మనల్ని ఆహ్లాదపరిచేది. చెట్టూ, చేమలు, పొలాలు, గుళ్లు, గోపురాలే కాదు; మనుషులు కూడా అందంగా ఉంటారు.''

''మనుషులకు అందం ఎందుకు, బాబు గారూ?'' అమాయకంగా అడిగాడు గోపయ్య.

''గోపయ్యా! నీకు కనిపించదు కాబట్టి అందం ఎందు కనుకుంటున్నావు. కళ్లున్న మనుషులు తనకు కావలసిన వన్నీ అందంగా ఉండా లనుకుంటారు. కొందరు నల్లగా, తెల్లగా, పొట్టిగా, పొడవుగా ఉంటారు. నల్లగా ఉన్నవాడు, తెల్లనైన వాడు ఇద్దరూ తెల్లగా, అందంగా ఉండే అమ్మాయే భార్య కావా లంటారు. పిల్లలు అందంగా ఉండా లనుకుంటారు. మనిషి స్వార్థం అది.''

తనకు కనిపించనవి, తనకు తెలియని విషయాలు పంతులుగా రబ్బాయి చెబుతుంటే హృదయ నేత్రంతో వాటిని చూస్తున్నట్లు, వాటి మధ్య తిరుగుతున్నట్లు తియ్యటి అనుభూతి కలిగింది.

''బాబు గారూ! స్వార్థం అంటే?''

''నువ్వు చాలా అదృష్టవంతుడివిరా... పాప పుణ్యాలు, కుళ్లూ కపటాలు, మోసం, దగా, వంచన... ఇవేవీ నీకు తెలియవు. అన్నీ తనకు కావాలని, తనే బాగుండాలని ప్రతీ మనిషి అనుకుంటాడు. అదే స్వార్థం. ఈ స్వార్థంతోనే మనిషీ మనిషీ కొట్టుకుంటారు. కులం, మతం పేరుతో తేడాలు సృష్టించుకుని గొడవలు పెట్టుకుంటారు. కొట్టుకు ఛస్తారు.''

చిన్నబ్బాయిగారు చెప్పినప్పుడు భయం వేసింది గోపయ్యకు.

మనిషిలోని స్వార్థం అంత భయంకరమైనదా?

మొదటిసారిగా తెలుసుకున్న గోపయ్య తనకు ఏ స్వార్థమూ లేనందుకు సంతోషించాలో, ఏవీ చూడలేకపోతున్నందుకు బాధపడాలో తేల్చుకోలేకపోయాడు.

ఎక్కడ తిన్నా ఎక్కడ పడుకున్నా అడుగులు మాత్రం పంతులుగా రింటి వైపే వెళ్లేవి. చి న్నబ్బాయిగారు లోకంలోని వింతలు, విడ్డూరాలు గురించి చెప్పేవారు... అవి విం టున్నంత సేపు

మనో ఫలకంపై వాటి అందాలకు ముద్ర వేసుకునేవాడు గోపయ్య.

ఒక రోజు వంతులుగా రింటిలో ఏదో హడావిడి... చాలామంది వస్తున్నట్లు, వెళ్లిపోతున్నట్లు అడుగులు ఎక్కువగా వినిపిస్తున్నాయి. తనను ఎవరూ పట్టించుకోవడం లేదు. చిన్నబ్బాయిగారు లేరా! ఉంటే తనను పలుకరించేవాళ్లే.

''అమ్మాయిగారూ... అమ్మాయిగారూ!'' గోపయ్య పిలిచాడు.

ఇంతలో ఇంట్లోంచి బిగ్గరగా ఏడుపులు...

ఎందు కేడుస్తున్నారు, ఎవరికి ఏమైంది?

గోపయ్యకు కంగారుగా ఉంది...

ఇంట్లో ఏమైంది? ఎవరు చెబుతారు తనకు?

అడుగుల శబ్దం... చిన్నబ్బాయిగారు...

''బాబుగారూ!''

''గోపయ్యా! మాకు అన్యాయం జరిగిపోయిందిరా...''

చిన్నబ్బాయిగారు ఏడుస్తున్న శబ్దం...

గోపయ్యా మరో రెండడుగులు వేసి చేత్తో తడిమాడు. చిన్నబ్బాయిగారి చేయి తగిలింది.


చంపుతాడా!

డబ్బు మనిషినీ మనిషినీ వేరు చేస్తుందా!

అటువంటి నీచమయిన డబ్బును చూడలేని తను ఎంత అదృష్టవంతుడిని అనుకున్నాడు గోపయ్య. తనకు కళ్లు లేకపోయినా లోకాన్ని తన హృదయానికి చేరవేస్తున్న చిన్నబ్బాయిగారంటే ఎంతో గౌరవం గోపయ్యకు. రెండు పూటలా అన్నం మెతుకులు, పడుకోవడానికి అరుగు... వీటి గురించే ఎప్పుడూ ఆలోచించే గోపయ్యకు చిన్నబ్బాయిగారి వలన లోకం ఎలా ఉంటుంది. తన చుట్టూ ఏం జరుగుతుందో తెలుసుకోవాలని కోరిక కలిగింది. అందుకే రోజూ చేతి కర్ర సహాయంతో పంచాయతీ ఆఫీసు వరకు వెళ్లి రేడియో వార్తలు వినడం, 'ఏం జరిగింది బాబూ?' అని ఎవరినైనా అడగడం అలవాటు చేసుకున్నాడు.

సంవత్సరాలు గడిచిపోయాయి...

వయసు మళ్లింది అసలు అది ఎలా ఉంటుందో తెలియకుండానే... ఎవరు అన్నం పెడితే అక్కడే ఉండిపోతున్నాడు. నడిచే ఓపిక సన్నగిల్లిపోతుంది అంతకంతకూ.




''బాబుగారూ! మీరు ఏడుస్తున్నారా?''

''గోపయ్యా! ఉన్న దాంతో గౌరవంగా కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు నాన్నగారు. ఇల్లు తాకట్టు పెట్టి చెల్లెలు పెళ్లి చేశారు సంవత్సరం క్రితం... పెళ్లయి సంవత్సరం కాకుండానే నూరేళ్లు నిండిపోయాయి.''

''బాబుగారూ! చిన్నమ్మాయిగారి కేమైంది?''

''చచ్చిపోయిందిరా... ఒకరి స్వార్థానికి బలయిపోయిందిరా.''

మళ్లీ చిన్నబ్బాయిగారు ఏడ్చిన శబ్దం.

గోపయ్యకు ఏడుపు ఆగలేదు.

''ఎందు కిలా జరిగింది బాబుగారూ?''

''డబ్బు... డబ్బు... కట్నం సరిపోలేదని, ఇంకా డబ్బు తీసుకురమ్మని రోజూ గొడవ పెట్టేవాడట బావ. ప్రతీసారి డబ్బు ఇవ్వలేమని చెప్పేది. ఫలితంగా దెబ్బలు... ఆ నరకాన్ని భరించలేక, నాన్నగారిని డబ్బు అడగలేక ఉరేసుకుందిరా.''

డబ్బు ఇంతటి అన్యాయానికి కారణమవుతుందా!

డబ్బు కోసం మనిషి మరో మనిషిని

''ఒరేయ్ గుడ్డోడా... తిన్నావు కదా... అలా గుడివరకు పోయి అక్కడ పడుకో...''

''ఈ గుడ్డోడిని అలా కొంత దూరం నడిపించి వదిలి రండి.''

కొత్త కొత్త మాటలు వింటున్నాడు గోపయ్య.

''ఈ పూటకు మరో ఇల్లు వెదుక్కో... ఠంచనుగా తయారైపోతావు.''

మనుషులు మారుతున్నారా?

అసలు తనది ఈ ఊరేనా?

అడుగులు పొరబడి మరో చోటకు వెళ్లాయా?

''ఏం గుడ్డోడా... ఈ రాత్రి ఎవ రింట్లో... నీ పని బాగుందిరా... పని పాటు లేకుండానే రెండు పూటలా మెతుకులు దొరుకుతున్నాయి. కళ్లు. కళ్లు లేని నీపోటి వాళ్లే నయం... మాకు రెక్కాడితే గాని డొక్కాడదు.''

తనకు దగ్గరగా వినబడ్డాయి మాటలు.

''నేనేరా... మునసబుగారింట్లోని పాలేరు కొడుకును. నాన్న నన్ను పని కెళ్ల మంటున్నాడు. నేను వెళ్లను అని చెప్పాను. పని చేసుకుని బ్రతుకు... ను వ్వేం కుంటోడివా. గుడ్డోడివా

కూర్చుని తినడానికి అని. బయటకు గెంటేశాడు.''

గోపయ్య గుండె కళుక్కుమంది.

తనకూ కష్టపడాలని ఉందని, అందరిలాగే పని చేసి డబ్బు సంపాదించి తను సొంతంగా వండుకుని తినాలని ఉండదని ఎలా చెప్పగలడు? భగవంతుడు తనకు అన్యాయం చేశాడు. కబోదిని చేసి కష్టపడే యోగం లేకుండా చేశాడు.

ఆ ఇల్లు, ఈ ఇల్లు తిరగడం... వాళ్లూ, వీళ్లూ పెట్టింది తినడం...

ఎక్కడో ఒక దగ్గర నిద్రపోవడం.

ముప్పాతిక వంతు బ్రతుకు ఇలాగే అయిపోయింది.

అదే సమయంలో....

ఎక్కడి నుండి వచ్చాడో...

ఏ ఇంటి బిడ్డో...

''తాతయ్యా...!'' మొదటిసారిగా ఆ కొత్త పిలుపు గోపయ్య గుండెకు గిలిగింతలు కలిగించింది.

''ఎవరు బాబూ నువ్వు?''

''నేనూ నీలాగే అనాథను. అమ్మా, నాన్న కూలి పని చేసేవాళ్లు, లారీ ప్రమాదంలో ఇద్దరూ ఒకేసారి చనిపోయారు. నేను అయిదో తరగతి వరకు చదువుకున్నాను. ఈ ఊర్లో ఉండలేక పట్నం వెళ్లిపోదా మనుకుంటున్నాను'' అని ఏడ్చాడు.

గోపయ్యా ఆ కుర్రాడిని దగ్గరకు రమ్మని ''బాబూ... నేను ఈ ఊర్లో పుట్టాను. కళ్లు లేని నన్ను ఊరు పెంచింది. వీధి వీధీ నన్ను ఆదరంగా చూసింది. నీకు నేను పని ఇప్పిస్తాను. నన్ను కరణంగా రింటికి తీసుకెళ్లు'' అన్నాడు.

గోపయ్యా చేతి కర్ర ఆ కుర్రాడు చేతిలో...

గోపయ్యా కరణంగా రింటి దగ్గరకు వెళ్లాడు.

అమ్మగారి అడుగులు...

''ఏరా... గోపయ్యా... ఈ కుర్రా డెవడు?''

''అమ్మగారూ! అమ్మా, నాన్న చనిపోయారట. ఏ దిక్కులేని వెధవ నన్ను తాతయ్యా అని పిలిచాడు. ఎక్కడికో పోతానంటే, అన్నపూర్ణ లాగిళ్ల ఊరు వదలి ఎక్కడికి పోతావని మందలించి తీసుకొచ్చాను. అయ్యగారికి చెప్పి చిన్న పని ఇప్పించండమ్మా! వాడి చిన్న కడుపు నిండిపోతుంది'' అన్నాడు.

అమ్మగారు అయ్యగారు రాగానే చెప్పారేమో... ఆ కుర్రాడిని పనిలో పెట్టుకున్నారు కరణంగారు.

''తాతయ్యా... నువ్వు ఆ ఇల్లు, ఈ ఇల్లు తిరగవద్దు. ఇక్కడే ఉండిపో... ఖాళీ జాగాలో చిన్న గుడిసె వేస్తాను. అందులో నువ్వు ఉందువు.''

కొత్త కొత్త మాటలు...

''తిరిగే కాళ్లు ఒక దగ్గర ఉంటాయా!''

''తాతయ్యా... ఈ వయసులో ఎవరో ఒకరు తోడు ఉండాలి. నీకే కళ్లుంటే పెళ్లి చేసుకునేవాడివి... పిల్లలు పుట్టేవారు.''

''అవును... ఆ అదృష్టం నాకు లేదు.''

''అందుకనే నువ్వు నాతో ఉండిపో!''

''అవునురా గోపయ్యా... వయసులో రోజులు జరిగిపోతాయి. అన్నీ సవ్యంగా ఉన్న వాళ్లకే ముసలి వయసులో కష్టాలు తప్పడం లేదు. పిల్లలు ఉంటే వాళ్లు ఏదో ఉద్ధరిస్తారని కాదు,

కాస్తంత చేయూత నిచ్చి కట్టెకు నిప్పంటించి పున్నామ నరకం తప్పిస్తారు'' కరణంగారి మాటలు...

గోపయ్యకు అప్పు డనిపించింది మొదటిసారిగా...

తనకే క ళ్ళుంటే...

తనకూ పె ళ్ళయ్యేది...

పిల్లలూ పుట్టేవాళ్ళు...

తననూ పున్నామ నరకం నుండి తప్పించేవాళ్ళు...

"తాతయ్యా... ను వ్వేం బాధపడకు... నే నున్నాగా... నేనే నీ మనవడిని అనుకో' అని దగ్గరయిన ఆ కుర్రాడే గోపయ్య మనవ డయ్యాడు... ఏ జన్మలోని శేషమో ఇప్పుడు దగ్గ రయ్యా డనుకున్నాడు గోపయ్య.

అలా రెండు సంవత్సరాలు గడిచాయి.

గోపయ్య చేతి కర్ర నేలకు తగలడం లేదు.

ఆ కుర్రాడు... రాము... చేతిలో...

చేతి కర్ర పట్టుకుని తనకు దారి చూపిస్తున్న రాము మాటలు, చేష్టలు, వాటిని చెప్పే విధానంతో చెప్పి తన వార్ధక్యంలో పడే బాధలను పోగొడుతున్నా డనుకున్నాడు గోపయ్య.

జ్ఞాపకాల నుండి బయట పడ్డాడు గోపయ్య 'తాతయ్యా... తాతయ్యా!'' అనే రాము పిలుపుతో...

"ఎందుకురా పట్నం?"

ఈ ఊరు వదలి వెళ్లాలని లేదు గోపయ్యకు.

"తాతయ్యా... ధరలు పెరిగిపోతున్నాయి. అందరినీ పోషించాలంటే కష్టంగా ఉంది. ఎక్కడికైనా వెళ్లి మరో పని చూసుకోమని చెప్పారు కరణంగారు." నిజం కూడా అంతే...

"రామూ... ముసలివాడిని నే నెందుకు... ఈ ఊర్లోనే, ఈ నేలమీదే రాలిపోతాను. ను వ్వెళ్ళు... పట్నంలో పని సంపాదించి, పె ద్దయ్యాక పెళ్లి చేసుకుని, పిల్లా పాపలతో సుఖంగా ఉండు'' అన్నాడే గాని, రాముని విడిచి ఉండలేదు గోపయ్య.

"తాతయ్యా... నీ సొంత మనవడిని ఇలా దూరం చేసుకుంటావా? ఈ వయసులో మనవడి తోడు లేకుండా ఎలా ఉండగలవు?"

అవును... ఈ గుడ్డివాడు ఏ తోడూ లేకుండా ఎలా ఉండగలడు?

మనవడి మాటను కాదనలేకపోయాడు.

మొదటిసారిగా ఆ ఊరు విడిచి వెళ్లాలనే భావన కలగడంతో శరీరం చిన్నగా వణికింది. ఇల్లు ఇల్లునూ పరామర్శించాడు. గడప గడపనూ తడిమి పలుకరించాడు. వీధి వీధికీ కృతజ్ఞతలు చెప్పాడు. ప్రతి ఇల్లూ అన్నం పెట్టింది. ప్రతి గడపా ఎండలో, వానలో నీడ నిచ్చింది. ప్రతి వీధీ బ్రతికించింది.

ఊరు మారినా గోపయ్యకు తెలియదు.

· మనుషులు కొందరు మారినా పాత నీడలు అలాగే కొన్ని ఉన్నాయి.

అందుకే గుడ్డి వాడినైనా ఆదరించింది ఈ ఊరు.

అటువంటిది ఈ రోజు ఈ ఊరు విడిచి వెళ్లాలి. మనవడు చూపించే దారిలో వెళ్లాలి.

బస్సుల రొద... గోపయ్యకు తెలిసింది రాము తనను బస్సు ఎక్కిస్తున్నాడని. ఇరుకుగా ఉంది. అలాగే నిలబడ్డాడు చాలాసేపు. బస్సు ఆగిన శబ్దం. రాము దింపాడు. ఎక్కడికో నడిపిస్తున్నాడు.

"తాతయ్యా... ఇంకో బస్సు ఎక్కితే మరో పెద్ద ఊరు వెళ్లవచ్చు. అక్కడ ఎన్నో పనులు దొరుకుతాయి."

గోపయ్య నవ్వి మనవడితో మళ్లీ బస్సు ఎక్కాడు.

ఆ బస్సు ఆగి ఆగి చాలాసేపు ప్రయాణించింది.

బస్సు ఆగింది.

"రామూ... ఈ ఊరు పే రేంటి?"

"హైదరాబాద్ తాతయ్యా... నువ్వు చూడలేవు గాని... ఎంత పెద్ద పెద్ద ఇ ళ్లున్నాయో... పెద్ద బస్సులు... కార్లు... రోడ్లు కూడా పెద్దవే... ఎంత అందంగా ఉందో...'' అని ఒక్కొక్క దాని గురించి వర్ణించి చెప్పడం మొదలుపెట్టాడు.

పంతులు చి న్నబ్బాయిగారు కూడా ఇలాగే వర్ణించి చెప్పేవారు. తను చూడకపోయినా అందమైన వాటి మధ్య ఉన్నాడు. గోపయ్యకు ఆనందంగా ఉంది. తనకు కనిపించకపోతేనేం...

ఎక్కడి కెక్కడికో నడిపిస్తున్నాడు.


"తాతయ్యా... ఈ గుడి వరండాలో కూర్చో. నేను అలా ఊరు తిరిగి పని వెదుక్కుంటాను. నేను వచ్చేవరకు ఎక్కడికీ వెళ్లకు."

తర్వాత రాము మాటలు వినిపించలేదు. వెళ్లాడేమో! తనకు తోడుగా ఉండి, తనకు దారి చూపించాలని తాపత్రయపడుతున్న రాము ఎంత మంచి మనవడు! తన రక్తంలోంచే వచ్చాడా అనిపిస్తుంది. ఇలా రాము గురించే ఆలోచిస్తూ ఎన్ని గంటలు గడిపాడో తెలియదు... ఎన్నో అడుగులు... ఎవ రెవరో... గోపయ్య గుండెకు అలవాటయిన అడుగు... రాము వచ్చాడు.

"తాతయ్యా... నాకు పని దొరికింది. పెద్ద ఆఫీసరుగా రింట్లో... బట్ట లుతకడం, కారు తుడవడం, బజారు పని చేయడం... అంతే. రేపు చిన్న ఇల్లు చూస్తాను. నువ్వు ఎక్కడికీ తిరగ నవసరం లేదు."

రాము హుషారుగా చెప్పుకుపోతున్నాడు.

గోపయ్య మనవడిని గుండెకు హత్తుకున్నాడు.




రాము చిన్న గుడిసె - అదీ ఊరికి దూరంగా చూశాడు.

ఉదయం వెళ్లి ఏ రాత్రికో వచ్చేవాడు.

"తాతయ్యా... నన్ను అయ్యగారు వాళ్ల ఇంట్లోనే ఉండిపొమ్మంటున్నారు. నాకు : తాతయ్య ఉన్నాడని చెప్పాను. ఇద్దరం ఇంట్లో ఉండడానికి ఒప్పుకోరు కదా! రెండు గంటలు నడవాలి రోజు. బస్సు ఎక్కాలంటే రూపాయి ఖర్చు."

తను రాము కెంత అడ్డుగా ఉన్నాడు! రోజూ అంత దూరం నడిచి వెళుతున్నాడు. తను లేకపోతే ఆఫీసరుగా రింట్లో హాయిగా ఉండేవాడు. గోపయ్య అదే అన్నాడు.

"తాతయ్యా... ఇం కెప్పుడూ అలా అనవద్దు. ఈ వయసులో నాకు కష్టం ఏమిటి? ఆడుతూ పాడుతూ తిరుగుతాను."

మనవడి మాటలకు పొంగిపోయాడు గోపయ్య.

గోపయ్యకు ఆనందంగా ఉంది.

తిండికి లోటు లేకుండా ఉదయం, మధ్యాహ్నం, రాత్రి అన్నీ తెస్తున్నాడు రాము. ఇంటికి రాగానే కబుర్లు... తను చూసింది రాము తన గుండెకు హత్తుకునేలా చెబుతుంటే అవి చూసినంత అనుభూతి కలిగేది గోపయ్యకు. ప్రపంచంలో ఇన్ని అందాలను చూసే అదృష్టం తనకు ఇవ్వనందుకు భగవంతుడ్ని నిందించేవాడు.

రోజులు గడుస్తున్నాయి.

ఏ దిక్కూ లేని తనకు రాము దిక్కయ్యాడు.

ఏ రక్త సంబంధమూ లేని రాము అంతకంటే మిన్నయ్యాడు.

తనకు పెళ్లీ పెటాకులు లేవు. తన గుడ్డితనం అన్నింటిని దూరంగా ఉంచింది. అయినా చివరి దశలో ఏ దేవుడు పంపించాడో వచ్చాడు రాము. తనకు మనవ డయ్యాడు. తన చేతి కర్ర పట్టుకుని తనను కడదాకా నడిపించడానికి వచ్చాడు.

నె ల్రోజులు గడిచాయి.

"తాతయ్యా... నువ్వు ఎక్కడికీ కదలకు. ఊళ్లో గొడవలు జరుగుతున్నాయి. ఒకళ్లను ఒకళ్లు కొట్టుకుంటున్నారు. పోలీసులు తిరుగుతున్నారు'' అని ఒక రోజు హెచ్చరించినట్లుగా చెప్పాడు రాము.

ఎందుకు కొట్టుకుంటున్నారు?

పోలీసులు ఎలా ఉంటారు?

గోపయ్యకు మొదటిసారి భయం పట్టింది.

బిక్కి బిక్కు మంటూ అలాగే గుడిసెలో ఓ మూల కూర్చున్నాడు గోపయ్య... ఏ రాత్రో వచ్చాడు రాము. ఆ అడుగులకు ప్రాణం వచ్చేది గోపయ్యకు.

"తాతయ్యా... నిన్ను నాతో రేపు మా ఆఫీసరుగారింటికి తీసుకెళ్లిపోతను. కొట్టుకోవడం, చంపుకోవడం ఎక్కువయిపోతున్నాయి. పోలీసులు అందరినీ జైల్లో పెడుతున్నారు. ఇక్కడ ఉండడం మంచిది కాదు. రేపు తెల్లవారగానే అయ్యగారింటికి వెళ్లిపోదాం."

గోపయ్య గబగబా భయపడుతూ చెబుతున్న మనవడిని దగ్గరగా తీసుకున్నాడు. ఒళ్లంత తడిమాడు. అనిర్వచనీయమైన అనుభూతి కలిగింది గోపయ్యకు. తనకోసం ఆదుర్దాపడే ఈ మనవడు ఎలా ఉంటాడు? "భగవంతుడా! ఒక్కసారి నాకు దృష్టిని ప్రసాదించు. ఈ ప్రపంచంలోని అందాలను చూడడానికి కాదు. కుళ్లూ, కపటం, కుల మత విద్వేషాలు చూడడానికి కాదు. నన్ను నడిపిస్తున్న ఈ చిన్న మనవడిని ఒక్కసారి చూస్తాను" అని అనుకున్నాడు... దేవుడిని ప్రార్థించాడు.

తెల్లవారింది... అని రాము చెప్పాడు.

వెలుగు చీకటులు ఒకటిగా ఉండే గోపయ్యకు ప్రకృతిలోని కదలికలే చెబుతాయి సంధ్యా సమయాలు.

ఒక్కసారిగా ఏవేవో శబ్దాలు... అవీ మరింత భయంకరంగా... ఎక్కడికో నడిపిస్తున్నాడు... గోపయ్య నడుస్తున్నాడు... గబగబా హడావిడిగా పడే అడుగులు... పరుగుల అడుగులు... తడబడే అడుగులు... అడుగులతో అరుపులు... పరుగులతో ఆర్తనాదాలు... అన్నీ వినబడుతున్నాయి. చుట్టూ ఏం జరుగుతోంది? ఏమైపోతోంది?

"తాతయ్యా... తొందరగా నడు. పోలీసులు తరుముతున్నారు. ఇండ్లకు వెళ్లి పొమ్మంటున్నారు." రాము చెబుతున్న తీరులో భయం! కర్ర పట్టుకుని తొందరగా నడవమని గుంజుతున్నాడు. గోపయ్యకు కష్టంగానే ఉన్నా గబగబా నడవడానికి... మనవడి చేతి కర్ర పట్టుకుని పరుగెత్తడానికి ప్రయత్నిస్తున్నాడు.

అడుగుల శబ్దం ఆగింది.

ప్రశాంతంగా పరిసరాలు ఉన్న ట్లనిపించింది.

"రాముా... ఒక్కసారే శబ్దాలు ఆగిపోయాయి. మనం ఎక్క డున్నాం. ఊళ్లోనా... ఊరు దాటి వెళ్లామా?"

"ఊళ్ళోనే ఉన్నాం తాతయ్యా... రోడ్డు మీద ఎవరూ నడవకూడదని పోలీసులు తరుముతున్నారు. మనం తొందరగా నడిచి ఏ ఇంట్లోనైనా తల దాచుకుందాం."

కొంత దూరం నడిచాడు గోపయ్య.

మళ్లీ శబ్దాలు వినిపించాయి.

అడుగుల చప్పుళ్లు... అవీ వేగంగా...

"ఒరేయ్ గుడ్డోడా... తొందరగా వెళ్లిపో... ఛంపేస్తారు..." ఎవరో తనను తోసిన ట్లనిపించింది గోపయ్యకు.

భయం... భయం... ఎప్పుడూ లేనంత భయం గోపయ్య గుండె నిండా ఆవరించింది.

ఎందుకు వీ ళ్లంతా పరుగులు తీస్తున్నారు?

ఎందుకు వీళ్లు కొట్టుకుంటున్నారు?

ఎందుకు ఒకరి నొకరిని చంపుకుంటున్నారు?

ఒక్కసారి ఒక గుంపు కదిలి వచ్చిన శబ్దం...

గోపయ్య చేతి కర్ర పడిపోయింది.

ఆ కర్ర పట్టుకున్న మనవడు ఏడి?

కర్ర ఎందుకు వదిలేశాడు?

తూలి పడ్డాడు ... పడి లేచాడు...

తన కర్ర ఏది? మనవడి చేయి ఏది?

"రాముా... రాముా..." బిగ్గరగా అరిచాడు.

"అమ్మా..." ఆ గొంతు మనవడిది.

"నాయనా... రాముా..." మళ్లీ అరిచాడు.

"తాతయ్యా... వెళ్లిపో... ఛంపేస్తున్నారు. నిన్ను కూడా ఛంపేస్తారు. అదిగో వాళ్ల చేతుల్లో కత్తులు,




తుపాకులు... తాతయ్యా... నీకు దారి చూపిస్తానని తీసుకొచ్చి ఇలా వదిలేస్తున్నందుకు నన్ను తిట్టకు. నేను నడవలేను. నిన్ను మరి నడిపించలేను. వెళ్లిపో... ఎక్కడికైనా వెళ్లిపో... తా...త...య్యా!"

మనవడి గొంతు ఆగిపోయింది.

"రాముా... ఎక్క డున్నావురా... ఏమైపోయావురా... ఒక్కసారి దగ్గరకు రారా... ఒక్కసారి నా గుండెకు హత్తుకోనీరా... నాయనా... మాట్లాడవేంరా..."

అరుస్తున్నాడు గోపయ్య.

మనవడి నుండి జవాబు రాకపోవడంతో పడుతూ లేస్తూ, పరుగు తీస్తున్నాడు. పడినప్పుడల్లా చేత్తో వెదుకుతున్నాడు మనవడి చేయి అందుకుందామని.

అడుగులు... వేగంగా కదిలే అడుగులు...

"అయ్యా... అమ్మా... నా మనవడిని చూపించి పుణ్యం కట్టుకోండి. కళ్లు లేని వాడిని బాబూ... నాకు దారి చూపించే మనవడు... నా కర్ర పట్టుకుని నన్ను నడిపించే నా మనవడు ఎక్క డున్నాడో చూసి చెప్పం డమ్మా... నన్ను నా మనవడి దగ్గరకు తీసుకెళ్లం డమ్మా... గుడ్డివాడి మీద జాలి చూపించం డయ్యా!" అని అరుస్తూ ప్రతి అడుగును ప్రాధేయపడుతున్నాడు.

ఏ అడుగూ తనను పట్టించుకోదేం?

ఏ అడుగూ తన దగ్గరకు రాదేం?

ఏ అడుగూ తన మనవడి జాడ చూపించదేం?

ఎవరికీ తను కనిపించడం లేదా?

తనలాగే అందరూ గుడ్డి వాళ్లేనా?

అక్క డక్కడే తిరుగుతూ, పడుతూ లేస్తున్న గోపయ్య కాలి కేదో తగిలిన ట్లనిపించింది. క్రింద పడి తడిమాడు. ఆ స్పర్శకు గోపయ్య ప్రాణం కదలి వచ్చింది... మనవడు... రాము...

'నాయనా... మనవడా... దొరికావురా... ఎంతసేపటి నుండి వెదుకుతున్నానురా... తాతయ్యా అని పిల వరా... నీ పిలుపుకోసం వెదుకుతున్నానురా... నా గురించి ఇంక నువ్వు కష్టపడవద్దురా... నన్ను మా ఊళ్లో కడతేర్చరా... ఈ ఊళ్లో మనం ఉండలేంరా... నా ఊరుకు దారి చూపించేయరా..."

గోపయ్య మనవడి ఒళ్లంత తడిమాడు.

మనవడు మాట్లాడడేం?

ముఖం తడిమాడు.

అప్పు డర్థమైంది గోపయ్యకు.

మనవడు ప్రాణంతో లేడని...

మనవడి చేతిలో బిగుసుకుపోయిన తన చేతి కర్ర...

గుండెలు పగిలేలా ఏడ్చాడు గోపయ్య.

"నాకు దారి చూపిస్తానని తీసుకొచ్చి నువ్వు నీ దారి చూసుకున్నావు. నాకు ఇప్పుడు ఎవరు దారి చూపిస్తారు మనవడా! నిన్ను ఎలా తీసుకెళ్లగలను? ఎక్కడకు తీసుకెళ్లగలను? నాకు దారి లేదు. నిన్ను ఏ దారిలో తీసుకెళ్లాలి? నాయనా... మనవడా... రాముా!"

గోపయ్య మనవడిని భుజంమీద వేసుకున్నాడు.

ముసలి వయసు ఆ బరువును ఎక్కువసేపు మోయనీయడం లేదు.

పడుతూ లేస్తున్నాడు.

అలాగే నడుస్తున్నాడు.

"మీరూ మీరూ కొట్టుకోండిరా... మిమ్మల్ని మీరు చంపుకోండిరా... నాకు దారి చూపించే నా చిన్న మనవడిని ఎందుకు చంపార్రా? మీరు మనుషులు కాదురా... రాక్షసులు.. నన్ను కూడా చంపండిరా..." గోపయ్య అరుస్తున్నాడు. గోపయ్య అరుపులను ఎవరూ పట్టించుకోవడం లేదు... ఎవరూ గోపయ్య దగ్గరకు రావడం లేదు.

గోపయ్య మనవడిని భుజం మార్చుకుంటూ అలాగే నడుస్తున్నాడు.

'నాయనా... బాబూ... అమ్మా... అయ్యా.... నాకు శ్మశానం వైపయినా దారి చూపం డయ్యా... నా మనవడిని మట్టిలో కలుపుతను. నేను దిక్కులేని వాడిని. నా మనవడి శవం దిక్కుమాలిన శవం చేయకం డయ్యా... దారి చూపించి పున్నెం కట్టుకోండి బాబూ.." దీనంగా అడుగుతున్నాడు ప్రతి అడుగును.

అయితే తన చుట్టూ ఉన్నది శ్మశానం కంటే ఘోరమైనదని... ఎక్కడ పడితే అక్కడ శవాలు పడి ఉన్నాయని... సజీవ దహనాల మంటలు రేగుతున్నాయని తెలియని గోపయ్య నడుస్తున్నాడు.

గోపయ్యకు ఎవరు దారి చూపిస్తారు?

ఎవరు దారి చూపిస్తారు? ★